
సాక్షి గుంటూరు

సోమవారం, 29, మే, 2023



సాగరమాతా.. వందనం

విజయపురిసౌత్: సాగర మాత ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

రెంటచింతల @ 47.2



రెంటచింతల: రెంటచింతలలో ఆదివారం 47.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటల నుంచి భానుడు ప్రతాపం చూపాడు. ఎండ తీవ్రతకు గ్రామస్తులు అల్లాడారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు వేసవి తాపాన్ని తాళలేక ఆపసోపాలు పడ్డారు. వడగాడ్పులకు భయపడి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రైతులు, వ్యవసాయ కూలీలు వేకువనే వెళ్లి పనులు ముగించుకుని ఉదయం పది గంటలకల్లా ఇంటి బాటపట్టారు. ఫలితంగా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. మూగజీవాలు కూడా ఎండకు అల్లాడిపోయాయి. వాగులు, కుంటలు, మడుగులలో సేదదీరాయి.

దుర్గమ్మ సేవలో హైకోర్టు జడ్జి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం, అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

నేడు దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల పాలక మండలి సోమవారం సమావేశం కానుంది. బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమవుతోంది. దేవస్థానానికి చెందిన 25 అంశాలతో పాటు పాలక మండలి పెట్టిన మరో 5 అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబతో పాటు ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమా, ఇతర ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు సమావేశానికి హాజరుకానున్నారు. మరో వైపున గత వారం ఆలయ ఈవో నియమించిన కొత్త వైదిక కమిటీ సభ్యులు కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలుస్తోంది. దేవస్థానంలో నిర్వహించే ఆర్జిత సేవలు, పూజలు, ఇతర వైదిక పరమైన అంశాల గురించి పాలక మండలి సభ్యులతో చర్చించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

పార్లమెంట్ భవనం.. అద్భుతం



చిలకలపూడి(మచిలీపట్నం): ఢిల్లీలో ఆదివారం ప్రారంభించిన నూతన పార్లమెంట్ భవనం అద్భుతంగా ఉందని లోక్‌సభ సబార్డినేట్ చైర్మన్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గాల పునర్విభజన జరిగి పార్లమెంట్ సీట్లు పెరిగినప్పటికీ కొత్త సభ్యుల రాకకు అనుగుణంగా తీర్చిదిద్దిన తీరును ఆయన కొనియాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మంచి దృక్పథం కలిగిన నేత అని, పరిపాలన, సంక్షేమాభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించటంలో గొప్ప మనిషి అని పేర్కొన్నారు. తొలిసారిగా నూతన పార్లమెంట్ భవనంలో అడుగుపెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. వేసవి సెలవులు, పెళ్లి ముహూర్తాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి వచ్చారు. ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుంచి రద్దీ కనిపించినప్పటికీ 9 గంటల నుంచి మరింత పెరిగింది. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి కనిపించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తుల తాకిడి కనిపించడంతో వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బంది లు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. ఎండ వేడితో భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

• సేవ్ పర్యావరన్



పర్యావరణ పరిరక్షణ నినాదంతో గుంటూరు రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం నుంచి గుంటూరు రైల్వే స్టేషన్ వరకు ఆదివారం డీఆర్‌ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో రైల్వే సిబ్బంది మారథాన్ రన్ నిర్వహించారు. ఈ ప్రదర్శనను తొలుత డీఆర్‌ఎం జెండా ఊపి ప్రారంభించారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వాడకం నివారణ, వర్షపు నీటి సంరక్షణ, సేంద్రియ ఉత్పత్తుల ప్రోత్సాహం, సౌరశక్తి వినియోగం, ఇంధన పొదుపు తదితర అంశాలపై నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సైమన్, శ్రీనివాస్, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

- లక్ష్మీపురం(గుంటూరు)

• ఆనందం ఇంటింతై



మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పేదలకు టిడ్కో గృహాల పత్రాలను ఆదివారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ ఉండడానికి ఇల్లు లేక ఎంతో ఇబ్బంది పడ్డామని, అద్దె ఇళ్లలో మగ్గామని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని తమ సొంతింటి కల సాకారమైందని సంతోషం వ్యక్తం చేశారు. ఒక్కరూపాయి ఖర్చు లేకుండా ఇళ్లు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని పేర్కొన్నారు.

- తాడేపల్లి రూరల్

శాశ్వత మేలు కలిగేట్టు

- చివరి దశకు పులిచింతల గేటు పునర్నిర్మాణ పనులు
- ఆమ్స్‌పై కూర్చోబెట్టిన రేడియల్ గేటు
- ఎరక్షన్ బ్రాసింగ్ పనులు పూర్తి
- కొనసాగుతున్న వెల్డింగ్ పనులు
- వారంలో అమరిక పూర్తి



ఆమ్స్‌పై ఎక్కించిన 16వ నంబరు రేడియల్‌గేటు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు 16వ నంబరు రేడియల్ గేటు పునర్నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మరో వారంలో పూర్తవుతాయని ఇంజినీర్లు చెబుతున్నారు. గతంలో వరదల సమయంలో 16వ నంబరు గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అప్పట్లో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులకు ఆదేశించింది. దీంతో అధికారులు స్టాప్‌లాగ్స్ ఎలిమెంట్స్ ఏర్పాటుచేసి గేటును బ్లాక్ చేసి కృష్ణాడెల్టాలో సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా జలాశయంలో నీటిని నిల్వ ఉంచుతూ వచ్చారు. ఆ తర్వాత శాశ్వత పరిష్కారంగా గేటు పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.18.84 కోట్లు మంజూరు చేసి, పనులను బికేం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ లిమిటెడ్‌కి అప్పగించింది. రెండు నెలలుగా పనులు వేగంగా జరుగుతున్నాయి. నూతన గేటును బిగించేందుకు 100 టన్నుల సామర్థ్యంగల హెవీ లోడెడ్ క్రేన్స్ వినియోగిస్తున్నారు. బీహార్ నుంచి 20 మంది నిపుణులు రోజుకు 10 గంటలకుపైగా శ్రమిస్తున్నారు. కాంక్రీట్ పనులు పూర్తిచేసి ఆమ్స్‌ను జలాశయం పైకి ఎక్కించారు. 300 టన్నుల సామర్థ్యం కలిగిన 16వ నంబరు రేడియల్ గేటును ఆమ్స్‌పైకి ఎక్కించారు. ప్రస్తుతం వెల్డింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఎరక్షన్ ఆఫ్ ఎంబ్రాసింగ్ పనులు పూర్తిచేసినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. పనుల వల్ల నిల్వ నీరు లీకేజీల ద్వారా వృథా కాకుండా 8గేట్లకు రబ్బరు సీల్స్ బిగించారు. గేటు నిర్మాణ పనులను ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామకృష్ణ, ఈఈ శ్యాంప్రసాద్, డీఈ అరుణకుమారి, ఏఈలు విక్రమ్, వెంకటరెడ్డి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

మరో వారం నాలుగుచక్రాల వాహనాలకు నో ఎంట్రీ

భారీ క్రేన్స్‌తో పనులు జరుగుతున్నందున మరో వారం రోజుల వరకు నాలుగు చక్రాల వాహనాలు ప్రాజెక్టుపై నుంచి వెళ్లేందుకు అనుమతులు లేవని ప్రాజెక్టు ఇంజినీర్లు తెలుపుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉదయం 8 గంటలలోపు ప్రాజెక్టుపై నుంచి తెలంగాణలోకి వెళ్లే అవకాశాన్ని కల్పించారు.

వినియోగదారుల రక్షణే లక్ష్యం

- హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు
- నోడల్ ఆఫీసర్‌గా జాయింట్ కలెక్టర్

సాక్షి, నరసరావుపేట: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు జిల్లా స్థాయి కమిటీ ఇటీవల ఏర్పాటైంది. దీనికి జాయింట్ కలెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఆయన అధ్యక్షతన లీగల్ మెట్రాలజీ, జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారి, విద్యుత్‌శాఖ, మున్సిపల్‌శాఖ ప్రతినిధులు, ఆయిల్ కంపెనీలు, ఆర్టీసీ, పోలీసులశాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. జాయింట్ కలెక్టర్ జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాలను నిర్వహించేలా పర్యవేక్షిస్తారు. వ్యాపారుల బారిన పడి మోసపోకుండా వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించేలా కమిటీ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో సదస్సులు నిర్వహిస్తుంది. వినియోగదారుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో నివేదికలు తెప్పించుకుని విశ్లేషిస్తుంది. అనంతరం జేసీకి నివేదిక అందజేస్తుంది. ఆ నివేదిక ప్రకారం జేసీ చర్యలు తీసుకుంటారు.

పాఠశాలల్లోనూ సంఘాలు

వినియోగదారుల హక్కులపై భావితరాలకు అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాలలో 8,9వ తరగతి విద్యార్థులతో వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. తరగతికి ఒకరు చొప్పున చురుకుగా ఉండే వారిని అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకోనున్నారు. అధ్యక్ష, కార్యదర్శుల్లో ఒక బాలుడు, ఒక బాలిక ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ సంఘాలు ప్రతినెలా సమావేశాలు ఏర్పాటు చేసి వినియోగదారుల సమస్యలపై చర్చించి నివేదికను జిల్లా కమిటీకి పంపుతాయి. చురుగ్గా పనిచేసే సంఘాలు, పాఠశాలలను ప్రభుత్వం గుర్తించి బహుమతులు అందజేస్తుంది.

వినియోగదారుల చట్టాలపై అవగాహన



ప్రజల్లో వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పిస్తాం. దీనికోసం మండల, పాఠశాల స్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేయనున్నాం. దీనిలో భాగంగానే పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కల పెంపకం, ఆహారభద్రత తదితర అంశాలపై చర్యలు చేపడతాం.

– శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్, పల్నాడు జిల్లా

సాగర్ జలాశయంలో మునిగి విద్యార్థి మృతి



సాయిరాఘవరెడ్డి

విజయపురిసౌత్: స్నేహితులతో కలిసి సాగర్ జలాశయంలోకి స్నానానికి వెళ్లిన ఆ యువకుడి కేరింతలు అంతలోనే ఆర్తనాదాలయ్యాయి. చూస్తుండగా నీటి సుడి మృత్యురూపమెత్తి ముంచేసింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం నాగార్జునసాగర్‌లోని కృష్ణా జలాశయంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన పురిటిపాటి సాయి రాఘవరెడ్డి(17) మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని ఏపీఆర్‌జేసీ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ చదువుతున్నాడు. ప్రస్తుతం సెలవులైనా బెటర్‌మెంట్ పరీక్షలు రాసేందుకు కళాశాలకు వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం ఐదుగురు విద్యార్థులతో కలిసి కృష్ణానదికి స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు సాయిరాఘవరెడ్డి నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు కాపాడే యత్నం చేసినా ఫలితం లేకపోయింది. సాయి రాఘవరెడ్డి మృతిచెందాడు. మృతుడి తండ్రి కోటిరెడ్డి హైదరాబాద్‌లో ప్రైవేట్ క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నాటక సంరంభం శుభారంభం



పల్లెకోనలో నాటకోత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న పరుచూరి వెంకటేశ్వరరావు



తొలిరోజు ప్రదర్శితమైన ఎర్రకలువ నాటకంలోని ఓ సన్నివేశం

- పల్లెకోనలో అఖిల భారత 31వ నాటకోత్సవాలు ప్రారంభం
- ప్రేక్షకుల కరతాళ ధ్వనులే కళాకారులకు దీవెనలు
- సినీ రచయిత, నటుడు పరుచూరి వెంకటేశ్వరరావు

పల్లెకోన(భట్టిప్రోలు): ప్రేక్షకుల కరతాళ ధ్వనులే కళాకారులకు దీవెనలని సినీ రచయిత, నటుడు పరుచూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో మూడేళ్ల విరామం అనంతరం పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 31వ డాక్టర్ డి.రామానాయుడు అఖిల భారత ఆహ్వాన నాటకోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు 31 వరకు 4 రోజుల పాటు జరగనున్నాయి. ప్రారంభోత్సవ సభలో పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమరుడైన తన కొడుకు సంస్మరణార్థం ఈ పోటీలను ప్రారంభించినట్లు చెప్పారు. మానసిక రుగ్మతలను సైతం నయం చేసి మనిషిని తేజోవంతం చేసే గుణం నాటకానికి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ కథా రచయిత, నటుడు, దర్శకుడు తులసి బాలకృష్ణ మాట్లాడుతూ నాటక రంగంలో విజ్ఞత, వినోదం కలసి ఉంటాయని, ఏ వేదిక అయితే తమకు గుర్తింపునిచ్చిందో దానిని మరువకుండా నాటకోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాటక రంగం వృద్ధికి పరుచూరి బ్రదర్స్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పరుచూరి రఘుబాబు మరణించి 28 ఏళ్లయినా నిజమైన హీరోగా వెలుగొందుతున్నారని చెప్పారు. పరుచూరి వెంకటేశ్వరరావుకు అద్భుతమైన వ్యక్తిత్వం ఉండటం వల్ల రఘుబాబు స్టార్ అయ్యారని పేర్కొన్నారు. తొలుత పరుచూరి వెంకటేశ్వరరావు కుమారుడు పరుచూరి రఘుబాబు చిత్రపటానికి వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాటకోత్సవ సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. వ్యాఖ్యాతగా డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి వీవీ రాజగోపాల్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అజ్ఞానాన్ని పటాపంచలు చేసిన ''ఎర్రకలువ''

''మన చుట్టూ ఉన్న ఇతర దేశాలు సాంకేతికంగా పురోభివృద్ధిలో దూసుకుపోతుంటే మనం ఇంకా సంస్కృతి, సంప్రదాయాల పేరుతో వెనుబడిపోవాలా? సాంకేతికత ఎక్కడిదైనా, ఎవరిదైనా దానిని అందిపుచ్చుకుని మనం అంచెలంచెలుగా అభివృద్ధి చెందాలి'' అంటూ ఆవేదన చెందిన ఒక ఇంజినీరు సిద్ధప్ప కథ ఎర్ర కలువ. శ్రీ కళానికేతన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకం ఆద్యంతం అలరించింది. ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకుంది. రచన ఆకురాతి భాస్కర్ చంద్ర, దర్శకత్వం డాక్టర్ వెంకట్ గోవాడ.

నేటి ప్రదర్శనలు

- సోమవారం రాత్రి 6:30 గంటలకు మిత్రా క్రియేషన్స్ నరసరావుపేట ఆధ్వర్యంలో ''ది ఇంపోస్టర్ '' (అంతా నిజమే చెబుతారు) ప్రదర్శితమవుతుంది. రచన ఆకురాతి భాస్కర్ చంద్ర, దర్శకత్వం ఎస్ఎం బాషా
- రాత్రి 8:30 గంటలకు కళాస్రవంతి ఉక్కు నగరం(విశాఖ పట్నం) ఆధ్వర్యంలో ''సవారి'' ప్రదర్శితమవుతుంది. రచన స్నిగ్ధ, దర్శకత్వం పి.బాలాజీ నాయక్

చంద్రబాబువి శుష్క వాగ్దానాలు

- జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ మేలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- చిలకలూరిపేటలో అట్టహాసంగా గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: టీడీపీ అధినేత చంద్రబాబువన్నీ శుష్క వాగ్దానాలని, ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చి, చెప్పింది.. చేసి చూపించిన ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని, ఇద్దరికీ మధ్య తేడాను గమనించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఆదివారం పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి వెల్లడించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ తమ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం మేనిఫెస్టోను ఎలా తుంగలో తొక్కిందో అందరం చూశామని పేర్కొన్నారు. ప్రజలకు ఏది అవసరమో తెలిసిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా పథకాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పథకాలను మరింత సమర్థంగా అమలు చేసేందుకు, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. గడప గడపలో ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తోట నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు తోట వెంకట సురేష్, కొండెబోయిన శ్రీనివాసరావు, షేక్ ఖాదర్ జిలాని, జి.మల్లేశ్వరరావు, ఐ.రాఘవరావు, ఐ.శివనాగేశ్వరరావు, బాబిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం కిరాతకం

సోదరుడు వరసైన వ్యక్తి హత్య



మృతి చెందిన అక్కెం వెంకయ్య

మాచర్ల: ఆస్తి వివాదంలో సోదరుడు వరసైన వ్యక్తిని హత్య చేసిన కిరాతక ఘటన మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం పట్లవీడు గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్లవీడు గ్రామానికి చెందిన అక్కెం వెంకయ్య (69)కు సోదరుడు వరసైన అక్కెం పకీరయ్యకు కొద్దికాలంగా ఎకరం పొలం విషయంలో వివాదం ఉంది. తనకు పొలం ఇవ్వకుండా కావాలని ఇబ్బందికి గురిచేస్తున్నాడని భావించిన పకీరయ్య ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇంటిముందు నిద్రిస్తున్న వెంకయ్యను గొడ్డలితో నరికి హత్య చేశాడు. అనంతరం పకీరయ్య పారిపోయాడు. కేకలు విన్న స్థానికులు వెంకయ్య బంధువులకు సమాచారం ఇచ్చారు. మాచర్ల రూరల్ సీఐ షేక్ షమీముల్లా, వెల్దుర్తి ఎస్ఐ వి.శ్రీహరి ఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్లవీడు నుంచి పిడుగురాళ్ళకు మకాం మార్చిన పకీరయ్య పొలంలో తనకు వాటా ఇవ్వాలని వెంకయ్యను వేధిస్తున్నాడని బంధువులు పోలీసులకు వివరించారు. వెంకయ్య ఒప్పుకోకపోవటంతో కక్ష పెంచుకుని హతమార్చాడని వెల్లడించారు. పోలీసులు వెంకయ్య మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. వెంకయ్య భార్య, కుమారుడు గతంలో మరణించారు. ముగ్గురు కుమార్తెలు పెళ్లిళ్లయి వేర్వేరు గ్రామాల్లో ఉంటున్నారు. వెంకయ్య ఒక్కడే గ్రామంలో ఉంటున్నాడు. వెంకయ్యను బాబాయి కొడుకు పకీరయ్య పథకం ప్రకారం హత్య చేయటం పట్లవీడులో చర్చనీయాంశమైంది.

కుటుంబ సభ్యుల కళ్లెదుటే మహిళ సజీవదహనం

- పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం
- కొడుకు వద్దని వారిస్తున్నా.. అఘాయిత్యం
- విషాదంగా మారిన తల్లీకూతుళ్ల మధ్య వివాదం



అగ్నికీలల్లో దహనమవుతున్న దృశ్యం, ఇన్‌సెట్‌లో సుజాత (ఫైల్)

ప్రత్తిపాడు: కుటుంబ సభ్యుల కళ్లెదుటే మహిళ సజీవ దహనమైన హృదయవిదారక ఘటన ప్రత్తిపాడులో జరిగింది. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు కథనం ప్రకారం ప్రత్తిపాడుకు చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు కొత్తా ఆదిలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు. ఆస్తుల విషయమై చిన్నకూతురు సుజాత (45) కుటుంబానికి, ఆదిలక్ష్మికి మధ్య వివాదం తలెత్తింది. చిన్న కూతురుతోపాటు ఆమె కుటుంబమంతా తన ఇంట్లో ఉంటూ, తనను కొట్టి చిత్రహింసలు పెడుతోందంటూ ఆదిలక్ష్మి ఇటీవల పోలీసులను ఆశ్రయించింది. కొద్దిరోజుల కిందట ప్రత్తిపాడుకు వచ్చిన ఎమ్మెల్యేనూ కలిసి గోడును వెల్లబోసుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానికుల సమక్షంలో ఆదిలక్ష్మి, పెద్దకుమార్తె కోటేశ్వరి తమ ఇంటి పోర్షన్‌కు హద్దు గోడ నిర్మించుకునేందుకు కూలీలను తీసుకు వచ్చారు. దీంతో చిన్న కూతురు సుజాతకు, ఆదిలక్ష్మికి మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి సుజాత పెట్రోల్‌ను తన ఒంటిపై పోసుకుంది. అగ్గిపెట్టెతీసి వెలిగిస్తున్న సమయంలో పక్కనే ఉన్న ఆమె 14 ఏళ్ల కొడుకు వద్దమ్మా అంటూ ప్రాధేయపడినా ఆమె వినలేదు. అగ్గిపెట్టె గీయడంతో చీరకు మంట అంటుకుని క్షణాల వ్యవధిలో అగ్నికీలలు సుజాత దేహమంతా వ్యాపించాయి. దీంతో స్థానికులు దూరంగా పరుగులు తీశారు. కొడుకు, కుటుంబ సభ్యుల ఎదుటే ఆమె పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వచ్చి పరిశీలించి ఆమె మృతిచెందినట్టు నిర్ధారించారు. ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్ర ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి 'అపుస్మా' కృషి

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న అపుస్మా నాయకులు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడుగా ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) పూర్తిస్థాయిలో సహకరిస్తోందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అపుస్మా ఉమ్మడి గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం అమరావతిరోడ్డులోని కెనడీ నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఇటీవల ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ఎంవీ రామచంద్రారెడ్డితో పాటు టి.కల్పలతారెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రామచంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయిలో 'నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్' లో భాగమైన 'అపుస్మా' జాతీయ, రాష్ట్ర స్థాయిలో విద్యా రంగంలో వస్తున్న మార్పుల కనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటోందని చెప్పారు. అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 14వేల పాఠశాలల సభ్యత్వంతో అపుస్మా ప్రభుత్వ విధానాలను సమన్వయం చేసుకుంటూ బలంగా ఉన్నదన్నారు. అన్ ఎయిడెడ్ పాఠశాలల రెన్యూవల్ గుర్తింపు మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంచేందుకు కృషిచేసిన ఎమ్మెల్సీల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వివరించారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు బి.పోతిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర నాయకులు ఎంబీఎస్ శర్మ, ఎంవీ రావు, పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, ఎస్.చక్రనాగ్, కె.శ్రీకాంత్ బాబు, కాటూరి వెంకటేశ్వరరావు, ఎస్.సాంబిరెడ్డి, మస్తాన్‌రావు, పి.సాయిబాబు, ఎండీ మున్నా, పీజేఎన్ ధన్, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పాఠశాలల కరస్పాండెంట్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సందడిగా టిడ్కో ఇళ్ల పంపిణీ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే
- ఇంటి పట్టాలతో పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు అందజేత



టిడ్కో ఇంటి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పేదలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టిడ్కో ఇళ్ల నివాస పత్రాలను ఎమ్మెల్యే ఆర్కే చేతుల మీదుగా పెనుమాకలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పెనుమాక టిడ్కో లే అవుట్‌లో మొత్తం 608 ప్లాట్లు నిర్మాణం జరిగాయని, అందులో 567 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందజేశామని, కొంతమంది లబ్ధిదారులకు బ్యాంకులో సిబిల్ స్కోర్ లేకపోవడం, ఇతర కారణాల వల్ల రుణాలు మంజూరు కాకపోవడంతో 41 మందికి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని, వారి రిజిస్ట్రేషన్ పత్రాలను సీఆర్‌డీఏ, బ్యాంకు అధికారులతో మాట్లాడి వారికి అందజేస్తామని అన్నారు. అనంతరం టిడ్కో ఇళ్లకు సంబంధించిన విద్యుద్దీకరణ స్విచ్‌లను విద్యుత్‌శాఖ అధికారులు, లబ్ధిదారులతో కలసి ప్రారంభించారు. ఇంటి పత్రాలతో పాటు ఎంటీఎంసీ తరఫున పసుపు, కుంకుమ, జాకెట్టుముక్క, మగవారికి కండువా, అర కేజీ స్వీట్లు అందజేశారు. ఏపీ టిడ్కో ఎస్‌ఈ చినకోటయ్య, ఈఈ ప్రసాదరావు, సీఆర్‌డీఏ ఎండీఓ శ్రీనివాసరావు, కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పెనుమాక అధ్యక్షుడు దామేష్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బొక్కానాని, భుజంగరావు, బషీర్ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్..

నిడమర్రు/నవులూరు(మంగళగిరి): రాష్ట్రంలో ఏ ఒక్కరు సొంతిల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికి ఇల్లు అందేలా కృషి చేశారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగర పరిధిలోని నిడమర్రు, నవులూరు వైఎస్సార్ జగనన్న కాలనీలలోని టిడ్కో ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ చేసిన సేల్‌డీడ్‌లను ఆదివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులతో కలిసి పంపిణీ చేశారు. నిడమర్రులో 544 ప్లాట్లుకు కాను అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన 430 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, సేల్‌డీడ్‌లను అందజేశారు. మరో 114 మంది లబ్ధిదారులకు సంబంధించి రుణప్రక్రియలో సాంకేతిక కారణాలతో ఆగగా త్వరలోనే వారి సమస్యలు పరిష్కరించి అందజేయడం జరుగుతుందన్నారు. నవులూరులో 672 మందికి 563 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు సేల్ డీడ్‌లను అందజేయగా 109 మందికి వున్న సాంకేతిక సమస్యలను బ్యాంకు అధికారులతో మాట్లాడి త్వరలోనే అందజేయడం జరుగుతుందన్నారు. ఎన్ని దుష్టశక్తులు అడ్డుపడ్డా అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఎంటీఎంసీ కమిషనర్ యు.శారదాదేవి, టిడ్కో ఎస్‌ఈ చిన్నకోటేశ్వరరావు, విద్యుత్ శాఖ డీఈ విజయ్‌కుమార్, డీఈ ప్రసాద్, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, టిడ్కో తహసీల్దార్ శ్రీనివాసరావు, సెక్రటరీ ధనలక్ష్మీ, మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి పాల్గొన్నారు.

ఐదేళ్ల తరువాత ఇల్లు వచ్చింది..



ఐదు సంవత్సరాల ముందు బ్యాంకులో డీడీ తీసి ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. అప్పటి నుంచి ఇల్లు మంజూరు అయిందని అధికారులు చెబుతూనే ఉన్నారు. ఈ మధ్యకాలంలో ఇక్కడకు వచ్చి చూస్తే రోడ్లు లేవు. ప్రస్తుతం రోడ్లన్నీ ఏర్పాటు చేసి విద్యుత్ లైన్లు కూడా వేసి, తాగునీటి సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు.

– కొప్పుల సాయి ప్రశాంతి, ఉండవల్లి

సౌకర్యాలన్నీ కల్పించారు..



గతంలో టిడ్కో ఇళ్లకు రోడ్లు లేవు. గోడలకు ప్లాస్టింగ్ లేదు, విద్యుత్ సౌకర్యం లేదు. ఐదు నెలల కాలంలో మౌలిక సదుపాయాలు కల్పించి మాకు ఇల్లు రిజిస్ట్రేషన్ చేసి అందజేశారు. త్వరలోనే గృహప్రవేశం చేసి కొత్త ఇంట్లో నివాసముంటాం.

– కంచర్ల దేవకుమారి, ఉండవల్లి

మాకెంతో ఉపయోగం..



మాకు 300 గజాల్లో ఇళ్లు లభించింది. అది మాకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. మా కుటుంబం హాయిగా జీవించవచ్చు. అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జగనన్న ప్రభుత్వం రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి మాకు ఇంటిని అందించింది. త్వరలోనే గృహప్రవేశం చేస్తాం.

– లకనం కుమారి, పోలకంపాడు

పది మంది జూదరుల అరెస్ట్

బాపట్ల టౌన్: పేకాట స్థావరంపై దాడిచేసి పది మందిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన మండలంలోని ఈతేరు గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ కె. వెంకటప్రసాద్ తెలిపిన వివరాలు.. ఈతేరు పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి జూదరులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.70,500 స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

బూడిదైన రూ.5లక్షల నగదు



విలపిస్తున్న బాధితురాలు, ఆమె కుమార్తె

కారెంపూడి: విద్యుదాఘాతంలో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన ఆదివారం స్థానిక వడియరాజుల కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు.. బాధితురాలు బత్తుల మరియమ్మ ఉదయం చర్చికు వెళ్లింది. ఇంటికి వచ్చి తలుపు తియ్యగానే ఇళ్లంతా పొగలు కమ్ముకుని మంటలు వ్యాపించి ఉన్నాయి. ఆమె కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వచ్చి మంటలను అదుపు చేశారు. కుమార్తె వివాహం కోసం ఇంట్లో దాచుకున్న రూ.5లక్షల నగదు కాలిపోయాయి. ఫ్రిజ్, కూలర్‌తో పాటు ఇతర గృహోపకరణాలు ఇతర సామనులన్నీ కాలి బూడిదయ్యాయి. విద్యుత్తు మీటరు కూడా పూర్తిగా కాలిపోయింది. పిడుగురాళ్ల నుంచి అగ్నిమాపక శకటం వచ్చే లోపలే మంటలను యువకులు ఆర్పేశారు. అగ్నిమాపక శాఖ అధికారి రామారావు బాధితురాలి నుంచి వాగ్మూలం తీసుకున్నారు. విద్యుదాఘాతం వల్ల ప్రమాదం జరిగిందని ఆమె తెలిపారు. జరిగిన నష్టాన్ని వివరించింది. ఎంతో కష్టపడి దాచుకున్న డబ్బు కుమార్తె వివాహం కోసం ఇంట్లో పెట్టుకుంటే ఇలా జరిగిందని బోరున విలపించింది. రెవెన్యూ, విద్యుత్తు శాఖ ఉద్యోగులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పై అధికారులకు నివేదించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

భర్తకు తీవ్రగాయాలు

తాడికొండ: ద్విచక్రవాహనంపై వెళుతున్న భార్య భర్తలకు రోడ్డుకు అడ్డుగా గేదెలు రావడంతో వెనుకనున్న భార్య కిందపడి మృతి చెందగా భర్తకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని నిడుముక్కల గ్రామశివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దంతాల వేణు, అతని భార్య ప్రశాంతి(35) తురకపాలెంకు బైక్‌పై వెళుతుండగా నిడుముక్కల గ్రామశివారులోని కళాజ్యోతి కంపెనీ వద్ద రోడ్డుకు అడ్డంగా గేదెలు వచ్చాయి. దీంతో వెనుకనున్న ప్రశాంతి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందింది. వేణుకు తీవ్రగాయాలు కావడంతో పోలీసులు వచ్చి 108లో అతడిని చికిత్సకోసం తరలించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మేదరమెట్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల తెలిపిన వివరాలు.. కొరిశపాడు మండల పరిధిలోని వెంకటాపురం క్రాస్ రోడ్డు జాతీయ రహదారిపై మోటారు బైకును ఢీకొన్న కారు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. జే.పంగులూరు మండలం రామకూరుకు చెందిన కందుకూరి ప్రసాద్ భార్య రేవతి మోటారు బైకుపై స్వగ్రామం నుంచి ఒంగోలు వైపు బయలుదేరారు. మార్గమధ్యంలో ఉన్న వెంకటాపురం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోని స్వామిని దర్శించుకొని బైకుపై రోడ్డు క్రాస్ చేస్తున్నారు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి వస్తున్న కారు మోటారు బైకును బలంగా ఢీకొంది. దీంతో బైకుపై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ కందుకూరి రేవతి(30) మృతి చెందినట్లు మేదరమెట్ల ఎస్ఐ పీ శివనాగిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన శ్యాంసన్

పర్చూరు(చినగంజాం): ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన పర్చూరు చీరాల రోడ్డులో ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాలు.. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామానికి చెందిన నవరపు శ్యాంసన్(29) ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి చీరాల వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో రోడ్డుపై ఆగి ఉన్న గడ్డిలోడు ట్రాక్టర్‌ను ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. కుంకులమర్రు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ టైరు పంచరు కావడంతో పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అక్కడే వదలి వెళ్లిపోయాడు. ద్విచక్ర వాహనంపై వస్తున్న శాంసన్ చీకటిలో అది కనిపించక ఢీకొట్టడంతో పడిపోయాడు. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. శ్యాంసన్‌ను చికిత్స నిమిత్తం తీసుకెళుతుండగా మార్గంమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి ఏడేండ్ల క్రితం వివాహం కాగా ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం వేకువ జామున బాపట్లలోని కేబుల్ నెట్‌వర్క్ పని చేస్తూ పని ముగించుకొని ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఎస్‌సీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్

నరసరావుపేట: రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ కె.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గుంటూరు రోడ్డులోని ఈఎన్‌టీ వైద్యశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో ప్రభుత్వ వైద్యశాల బ్లడ్‌బ్యాంక్‌లో రక్తనిల్వలు కొరత కారణంగా లింగంగుంట్ల కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాలలో శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యవసర సమయంలో రక్త సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ ఎల్.శివశంకర్ సలహా మేరకు శాసన సభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, యూత్ గ్రూప్స్, రక్తదానం చేసే అభిలాష ఉన్నవారందరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. 18 నుంచి 50 సంవత్సరాల వయసు వారు రక్తదానం చేయవచ్చని చెప్పారు. సమావేశంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తుల మురళి, కేఎంఎస్‌వీ శ్రీనివాసగుప్తా, జీవీఎస్ రాము పాల్గొన్నారు.

తిన్నది అరక్కపోతే తిప్పలే!

- నేడు వరల్డ్ డైజెస్టీవ్ డే
- అవగాహనతో జీర్ణకోశ వ్యాధులను కట్టడి చేయెుచ్చు
- ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దరిచేరవు



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల ఎక్కువ మంది జీర్ణక్రియ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి ఏడాది డైజెస్టీవ్ సమస్యలు పెరిగిపోతున్నాయి. ప్రాథమిక దశలోనే వాటిని గుర్తించి అరికట్టకపోతే పెద్దపేగు క్యాన్సర్‌కు దారితీయవచ్చు. జీర్ణక్రియ సంబంధిత సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వరల్డ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆర్గనైజేషన్ ఫౌండేషన్ 2004 నుంచి మే 29న వరల్డ్ డైజెస్టివ్ డే (జీర్ణ ఆరోగ్య దినోత్సవం) నిర్వహిస్తున్నారు. ఈఏడాది కొలొరెక్టల్ క్యాన్సర్ (పెద్దపేగు క్యాన్సర్)పై అవగాహన కల్పించాలని డైజెస్టివ్‌డే సందర్భంగా నిర్ణయించారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

తిన్న ఆహారం అరగకపోతే సమస్యలు..

జీర్ణ సంబంధిత సమస్యలు ఎక్కువగా మనం తీసుకునే ఆహారం సరైన పద్ధతిలో తీసుకోకపోవడం వల్ల వస్తున్నాయి. తిన్న ఆహారం సక్రమంగా జీర్ణం అవకపోవడం కూడా వ్యాధులు రావడానికి కారణమవుతోంది. తీసుకున్న ఆహారం సక్రమంగా జీర్ణమైనప్పుడే శరీరంలోని వివిధ అవయవాలకు శక్తి లభిస్తోంది. జీర్ణవ్యవస్థ మనం తీసుకునే ఆహారాన్ని జీర్ణం చేసి అందులోని పోషకాలను రక్తంలోకి చేరుస్తోంది. రక్తం నుంచి కాలేయానికి అక్కడి నుంచి పోషకాలు శరీరంలోని వివిధ అవయవాలకు చేరడం ద్వారా మనిషికి శక్తి లభిస్తోంది. యాంత్రిక జీవనం వల్ల హడావుడిగా ఆహారం తీసుకోవడం, ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, నిర్ణీత ఆహార వేళలు పాటించకుండా మసాలా దినుసులతో కూడిన ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా జీర్ణ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయి.

జీవనశైలితో పెరుగుతున్న వ్యాధులు..

జీర్ణక్రియ సంబంధిత వ్యాధులు ఆధునిక జీవన శైలి వల్ల పెరుగుతున్నాయి. ఇంట్లో ఆహారం తయారు చేసుకుని తినకుండా ఎక్కువ శాతం హోటళ్లలో తినడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి. ఉద్యోగరీత్యా, చదువులు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక సమస్యలతో ఎక్కువగా ఒత్తిడికి లోనవడం ద్వారా జీర్ణ సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

పెద్దపేగు క్యాన్సర్‌కు దారి తీయెుచ్చు...

జీర్ణకోశ సంబంధిత సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయకపోవడం ద్వారా అవి పెద్ద పేగు క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉంది. పెద్దపేగు క్యాన్సర్ సోకిన వారిలో ప్రాథమిక దశలో పొట్టకింద నొప్పి, పొట్టబిగపట్టడం, మలవిసర్జన సమయంలో నొప్పి, మలద్వారం నుంచి రక్తస్రావం అవడం, కొన్ని సార్లు ఎక్కువగా విరోచనాలు అవడం, బరువు తగ్గిపోవడం, అలసట, తదితర సమస్యలు కనిపిస్తాయి.

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు..

గుంటూరు జీజీహెచ్‌లో జీర్ణకోశ సంబంధిత సమస్యల బాధితులకు ఉచితంగా అత్యాధునిక వైద్య పరికరాలతో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నారు. వారంలో మంగళవారం, శుక్రవారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో వివిధ రకాల జీర్ణకోశ సంబంధిత సమస్యలతో బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ప్రతిరోజూ 300 మంది వివిధ రకాల సమస్యలతో వైద్యం కోసం వస్తున్నారు. జీర్ణకోశ సంబంధిత సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయవచ్చని గ్యాస్ట్రో ఎంట్రాలజీస్టులు తెలియజేస్తున్నారు. జీజీహెచ్‌లో ఈ సమస్యలకు అత్యాధునిక ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు మేలు..



ఆహారం తిన్నవెంటనే ఎట్టిపరిస్థితుల్లోనూ నిద్రకు ఉపక్రమించకూడదు. సాధ్యమైంత మేర రాత్రి వేళల్లో త్వరితగతిన 9 గంటల్లోపు భోజనం చేయాలి. భోజనం చేసిన అనంతరం కొంతసేపు నడవడం ద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతోంది. ఒత్తిడి, ఆందోళన లేకుండా యోగా, నడక, కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. జీర్ణ వ్యవస్థకు హాని కలిగించే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, గుంటూరు జీజీహెచ్